భారత్-అమెరికా సంబంధాలు...

భారత్-అమెరికాల మధ్య సంబంధాలకు ఎంతో ఘన చరిత్ర ఉంది. భారత దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రచ్ఛన్న యుద్ధం ముగిసేనాటిదాకా... రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో సంక్లిష్ట దశ! భారత పర్యటనకు వచ్చిన మొదటి అమెరికా అధ్యక్షుడు డ్వైట్ ఐషన్‌హోవర్.. 1959లో. బిల్ క్లింటన్, జార్జిబుష్ హయాంలో భారత్- అమెరికా సంబంధాల్లో అత్యున్నత దశ. ఇప్పుడు ఆ సంబంధాలు మరింత పరిపక్వ దశకు చేరుకున్నాయని చెప్పొచ్చు. పరిపక్వ దశ అంటే... రెండు దేశాలు పలు అంశాలపై సైద్ధాంతికంగా విభేదిస్తూనే... స్నేహపూర్వక సత్సంబంధాలు కొనసాగించగలగడం! అణు ఇంధన రంగంలో సహకారంతో సహా అమెరికా- భారత్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఇంతటి పటిష్ట స్థితిలో గతంలో ఎన్నడూ లేవు!!

భారత్–అమెరికా సంబంధాల్లో పౌర అణు ఒప్పందం అత్యంత కీలక మైంది. భారత్‌కు పౌర అణు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు గత మూడు దశాబ్దాలుగా అమెరికా నిరాకరిస్తూవస్తోంది. తాజా అణు ఒప్పందం ద్వారా ఆ పరిస్థితిని అధిగమించినట్లయింది. అణు రంగంలోనే కాకుండా భారత్‌తో అమెరికా రక్షణ సహకార ఒప్పందం కూడా చేసుకుంది. సంయుక్తంగా ఆయుధాల ఉత్పత్తికి సదరు రక్షణ సహకార ఒప్పందంలో అంగీకరించింది. దక్షిణ కొరియా, టర్కీ వంటి మిత్ర దేశాలతో మాత్రమే అమెరికా ఇలాంటి ఒప్పందం కలిగి ఉంది. నెక్ట్స్‌స్టెప్స్ ఇన్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ (ఎన్ఎస్ఎస్పీ)కు కార్యరూపం దిశగా.. వ్యవస్థాగత సహకారం అందించేందకు కూడా అమెరికా ముందుకు వచ్చింది. ఇందులో ఆర్థిక సహకారం, అంతరిక్ష టెక్నాలజీ వంటి అంశాలున్నాయి. భారత్ ఒక గొప్ప శక్తివంత దేశంగా ఎదగాలని తాను కోరుకుంటున్నట్లు అమెరికా చెబుతోంది. భారత్‌బలమైన దేశంగా మారడం వల్ల తనకు వచ్చే నష్టం ఏమీ లేదని స్పష్టం చేస్తోంది. ఇదే విషయాన్ని 2005 మార్చిలో అమెరికా అప్పటి విదేశాంగ మంత్రి కండొలిజా రైస్, భారత్ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు తేటతెల్లం చేశారు.

ప్రపంచ శక్తిగా భారత్:

భారత్ పట్ల అమెరికాలో పెరుగుతున్న గౌరవభావానికి భారత్ సాధిస్తున్న వేగవంతమైన ఆర్థిక వృద్ధి రేటు, ఎగుమతుల రంగంలో ఊపు, అణు పరీక్షలు, ఐటీ విజయాలు.. ప్రధాన కారణాలని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థ అమెరికా భద్రతకు సానుకూలంగా లేదని అమెరికా ఆందోళన చెందుతోంది. అందువల్ల 'బ్యాలెన్స్ ఆఫ్ పవర్ ఇన్ ఫేవర్ ఆఫ్ ప్రీడం'ను అమెరికా గట్టిగా కోరుకుంటోంది. ఈ సమీకరణంలో భారత్ సరిగ్గా సరిపోతుందని ఆ దేశం భావిస్తోంది. 21వ శతాబ్దంలో అంతర్జాతీయ వ్యవస్థకు ఒక రూపునిచ్చేందుకు 'భారత్‌తో భాగస్వామ్యం' అత్యంత కీలకమని అమెరికా తలపోస్తోంది. చైనా శక్తిమంత దేశంగా ఎదగడం కూడా అమెరికా ఆందోళనకు మరో కారణం. భారత్‌ను ప్రోత్సహించడం ద్వారా ప్రాంతీయ సమతౌల్యాన్ని సాధించవచ్చని, అదే సమయంలో చైనాను నిలువరించవచ్చన్నది అమెరికా వ్యూహం.

వ్యూహాత్మక సంబంధాలు:

భారత్‌లో అమెరికా రాయబారి డేవిడ్ సి.మల్‌ఫోర్డ్ మాటల్లోనే చెప్పాలంటే.. భారత్-అమెరికా సంబంధాలు ద్వైపాక్షిక స్థాయిని దాటి.. వ్యూహాత్మక భాగస్వామ్య స్థితికి చేరుకున్నాయి! రెండు దేశాల మధ్య సంబంధాలు పరస్పర ఉమ్మడి ప్రయోజనాలపై ఆధారపడి ఉన్నాయని మల్‌ఫోర్డ్ అన్నారు. ఉగ్రవాదంపై పోరు, హెచ్‌ఐవీ/ ఎయిడ్స్ నిర్మూలన, పటిష్ట ఆర్థిక సంబంధాలు.. వంటి అంశాలపై రెండు దేశాలు కలిసి పనిచేస్తాయని, పరస్పరం సహకరించుకుంటాయని ఆయన తెలిపారు. అనేక జాతులు, కులమతాలకు నిలయమైన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్‌తో విస్తృత, వ్యూహాత్మక సంబంధాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో నిర్ణయాత్మకం కాగలవని అమెరికా భావిస్తోంది.

హిల్లరీ పర్యటన:

అమెరికా విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ 2009, జూలై 18-22 మధ్య భారత్‌లో పర్యటించారు. ఒబామా మంత్రి వర్గంలో బాధ్యతలు చేపట్టాక హిల్లరీ భారత్‌కు రావడం ఇదే ప్రథమం. 1984 నుంచే భారత్‌తో అమెరికా 'ఎండ్ యూజర్ మానిటరింగ్ అగ్రిమంట్ (ఈయూఎంఏ)'ను చేసుకుంటోంది. అమెరికా నుంచి ద్విప్రయోజన, అత్యాధునిక టెక్నాలజీ కొనుగోళ్ల కోసం ఇది ఉద్దేశించింది. తాజాగా జూలైలో హిల్లరీ పర్యటన సందర్భంగా కూడా సమగ్ర 'ఈయూఎంఏ' ఒప్పందం జరిగింది. ఈయూఎంఏ ప్రకారం.. భారత్‌కు అమ్మిన రక్షణ పరికరాలను, టెక్నాలజీని అమెరికా ప్రత్యక్షంగా పరిశీలించవచ్చు. ఎప్పుడు పరిశీలించాలో మాత్రం భారతదేశమే నిర్ణయిస్తుంది. తమ దేశం నుంచి సున్నితమైన సైనిక సాంకేతిక పరిజ్ఞానం కొనుగోలు చేస్తున్న దేశాలు.. తుది ప్రయోజన (ఎండ్ యూజర్) ఒప్పందం చేసుకోవాలని అమెరికా పట్టుబడుతోంది.

టెక్నాలజీ సేఫ్‌గార్డ్స్ అగ్రిమెంట్ (టీఎస్ఏ):

టెక్నాలజీ సేఫ్‌గార్డ్స్ అగ్రిమెంట్ (టీఎస్‌సీ)పై అమెరికా విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్, భారత విదేశాంగ మంత్రి ఎస్.ఎం.కృష్ణ సంతకాలు చేశారు. అమెరికా ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రయోగించే శాటిలైట్లు, లేదా యూనివర్సిటీలు, విద్యా సంస్థలు, ఇతర దేశ అంతరిక్ష సంస్థలు ప్రయోగించే శాటిలైట్లు వంటివన్నీ ఈ ఒప్పందం పరిధిలోకి వస్తాయి. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) చేసే ప్రయోగాల్లో అమెరికా నుంచి అందే అత్యాధునిక టెక్నాలజీని, పరికరాలను వినియోగించడం జరుగుతోంది. ఇవి దుర్వినియోగం కాకుండా టెక్నాలజీ సేఫ్‌గార్డ్స్ అగ్రిమెంట్ పర్యవేక్షిస్తుంది.

సంయుక్త ప్రకటన:

- రక్షణ సహకారం దిశగా రక్షణ సహకార ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం-2005కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- నిరాయుధీకరణ కోసం అంతర్జాతీయంగా నిష్పాక్షికమైన ఫిజైల్ మెటీరియల్ కట్ ఆఫ్ ట్రీటీ

(ఎఫ్ఎంసీటీ) ఏర్పాటుకు కృషి చేయాలి.

- ప్రపంచంలో అణ్వాయుధాల వ్యాప్తి నిరోధానికి.. అణు ఉగ్రవాదాన్ని నివారించడానికి అంతర్జాతీయంగా ఉన్నతస్థాయి ద్వైపాక్షిక చర్చలు జరపాలి.
- అణు ఇంధన పునర్వినియోగం విదివిధానాలపై సంప్రదింపులను జూలై 21, 2009 నుంచి ప్రారంభించాలి.
- ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలు... జీ-8, జీ-20కు సంబంధించి చర్చలు కొనసాగించాలి. తద్వారా 21వ శతాబ్దంలో ఈ గ్రూప్‌ల ప్రాధాన్యత, దీర్ఘకాలిక విశ్వసనీయత, పటిష్టత ఆవిష్కృతమవుతుంది. సరళీకరణ వాణిజ్య, పెట్టుబడి విధానాల ద్వారా ఆర్థిక మాంద్యం నుంచి బయటపడటానికి కలిసి పనిచేయాలని జీ-20 సభ్య దేశాలు, భారత్, అమెరికా గతంలో అంగీకరించిన విషయాన్ని భారత్-అమెరికా ప్రకటన గుర్తుచేసింది.
- డబ్ల్యూటీవో దోహా రౌండ్ చర్చలు ఫలప్రదం అయ్యే దిశగా ఏదోఒక మార్గాంతరం కనుగొనాలని రెండు దేశాలు అంగీకరించాయి. రెండు దేశాల మధ్య ఆర్థిక సహకారం కారణంగా ఒనగూరే ప్రయోజనాలను పరిరక్షించుకుంటూనే... ఆర్థిక ద్వైపాక్షిక సంబంధాల మెరుగుకు కృషి చేయాలని కూడా నిర్ణయించాయి. దాంతోపాటు రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల ప్రవాహానికి కృషిచేయాలని నిశ్చయించు కున్నాయి. ప్రయివేట్ రంగంలోని వ్యాపార దక్షత, నైపుణ్యాలు ఆర్థిక వ్యవస్థలకు ప్రయోజనం చేకూరేట్లు చూడాలని రెండు దేశాలు నిర్దేశించుకున్నాయి. ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందంపై చర్చలు ఆగస్టు, 2009లో ఢిల్లీలో జరుగుతాయి.
- విద్యాసంస్థల మధ్య పరస్పర సహకారం, ఎక్స్చేంజ్ కార్యక్రమాల ద్వారా విద్యారంగం విస్తరణకు ప్రాధా న్యం ఇవ్వాలని అమెరికా-భారత్ సంయుక్త ప్రకటన అభిప్రాయపడింది. విద్యారంగ విస్తరణకు ప్రైవేట్ రంగం సహకారం అవసరమని పేర్కొంది.
- సైన్స్ అండ్ టెక్నాలజీ ఎండోమెంట్ ఒప్పందం, టెక్నాలజీ సేఫ్‌గార్డ్స్ ఒప్పందం(టీఎస్ఏ)పై రెండు దేశాలు సంతకాలు చేశాయి. ఫ్యూచర్ జెన్ ప్రాజెక్టులో భారత్ పాలుపంచుకోవడాన్ని ఇరుదేశాలు స్వాగతించాయి. నానోటెక్నాలజీ, సివిల్ న్యూక్లియర్ టెక్నాలజీ, సివిల్ ఏవియేషన్, డిఫెన్స్, సివిల్ న్యూక్లియర్ ట్రేడ్‌లో లైసెన్సింగ్‌పై కార్యాచరణ బృందాల ఏర్పాటుకు భారత్- అమెరికా అంగీకరించాయి.
- ఇంధన భద్రత, పర్యావరణ మార్పులపై సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇరుపక్షాలు అంగీకరించాయి.
- ప్రపంచ పర్యావరణ మార్పుల చర్చల ద్వారా ఇంధన సామర్థ్యం పెంపును, పునర్వినియోగ ఇంధనాల టెక్నాలజీ, పరిశుభ్ర ఇంధనాల టెక్నాలజీ వినియోగాన్ని పెంచే ప్రయత్నం జరగాలని భారత్-అమెరికా సంయుక్త ప్రకటన పేర్కొంది.
- సౌరశక్తి, పునర్వినియోగ ఇంధనాల వంటి ఉమ్మడి ప్రయోజనకారి రంగాల్లో వినూత్న టెక్నాలజీ

అభివృద్ధికి కృషి చేయాలని, పరస్పరం సహకరించుకోవాలని అంగీకారానికి వచ్చాయి.

- 2009, డిసెంబరులో జరుగనున్న యూఎన్ఎఫ్సీసీసీ సదస్సులో సానుకూల ఫలితాల సాధన దిశగా మేజర్ ఎకనామిస్ ఫోరం(ఎంఈఎఫ్) సభ్యదేశాలతో కలిసి పనిచేయాలనే నిర్ణయానికి కట్టుబడి ఉండాలని నిర్ణయించినట్లు భారత్–అమెరికా సంయుక్త ప్రకటన పేర్కొంది.

మన్మోహన్ అమెరికా పర్యటన:

సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో ఉమ్మడి పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలు, వ్యాపార, వాణిజ్య కార్యక్రమాల కోసం 30 మిలియన్ల డాలర్ల ఫండ్ ఏర్పాటుకు ఒప్పందం జరిగింది. అమెరికా కంపెనీల కోసం దేశంలో రెండు అణు ఇంధన పార్కుల ఏర్పాటుకు స్థలాలను కేటాయించేందుకు భారత్ హామీ ఇచ్చింది. భారత్, అమెరికాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా విస్తరించేందుకు విదేశాంగ మంత్రుల వార్షిక భేటీల ఏర్పాటుకు రెండు దేశాలు అంగీకరించాయి. ఈ చర్చల్లో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలను కూడా చేర్చుకోవాలని నిర్ణయించారు. 2010లో భారత్– అమెరికాల మధ్య జరుగన్న 'వ్యూహాత్మక చర్చ'ల్లో విస్తృత స్థాయి ద్వైపాక్షిక, అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై దృష్టి పెట్టాలని రెండు దేశాలు నిర్దేశించుకున్నాయి. భారత్ కు ఈఎన్ఆర్ టెక్నాలజీ బదిలీని అమెరికా వ్యతిరేకించదని హిల్లరీ క్లింటన్ తెలిపారు. అణు ఇంధన పునర్వినియోగ టెక్నాలజీ బదిలీని నియంత్రించాలంటూ ఇటీవల జీ–8లో చేసిన తీర్మానం భారత్‌కు వర్తించదని ఆమె స్పష్టంచేశారు. అమెరికా పర్యటనకు రావాలంటూ... ఆ దేశ అధ్యక్షుడు బరాక్ ఒబామా పలికిన ఆహ్వానానికి భారత ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ సానుకూలంగా స్పందించారు. 2009, నవంబరు 24న మన్మోహన్ అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు.

భిన్నగళం:

పర్యావరణం, అవుట్ సోర్సింగ్, ఎన్పీటీ, సీటీబీటీ, ఇరాన్.. వంటి అంశాలపై రెండు దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

ఇంధన భద్రత:

తాజాగా హిల్లరీ పర్యటన సందర్భంగా భారత్–అమెరికాల మధ్య జరిగిన ఒప్పందాలు రెండు దేశాల ద్వైపాక్షిక సం బంధాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రెండు దేశాల మధ్య రక్షణ సహకారానికి ఊతమిచ్చే ఈయూఎండీ ఒప్పందంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవు తున్నాయి. ఎందుకంటే... ఈ ఒప్పందం కారణంగా అమెరికాకు చెందిన అత్యాధునిక టెక్నాలజీ (కట్టింగ్ ఎడ్జ్ టెక్నాలజీ) భారత్‌కు అందుబాటులోకి వస్తుంది. అంతేకాకుండా అమెరికా కంపెనీలకు భారత మార్కెట్‌లోకి ప్రవేశం లభిస్తుంది. అంతరిక్ష రంగానికి సంబంధించిన టీఎస్ఏ ఒప్పందం కూడా అత్యంత ప్రాధాన్యంసంతరించుకుంది. ఇంధనం, వాణిజ్యం, వ్యవసాయరంగాల్లో కలిసి పనిచేసేందుకు

వీలుకల్పించే పలు ఒప్పందాలను రెండు దేశాలు చేసుకున్నాయి. జార్జిబుష్ హయాంలో జరిగిన భారత్–అమెరికా పౌర అణు ఒప్పందాన్ని అమలు చేయాలని ఒబామా ప్రభుత్వం నిర్ణయించడం రెండు దేశాల మధ్య సంబంధాల్లో మంచి పరిణామంగా పేర్కొనవచ్చు. అణు ఒప్పందాన్ని అమలు చేయాలన్న ఒబామా ప్రభుత్వ నిర్ణయాన్ని హిల్లరీ తన పర్యటన సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ ఒప్పందం కారణంగా ప్రపంచ స్థాయి అణు ఇంధన టెక్నాలజీ భారత్‌కు అందుబాటులోకి వస్తుంది. ఇది భారత ఇంధన భద్రతకు ఎంతో మేలు చేస్తుంది!!

ఐదు సూత్రాలు:

భారత్–అమెరికాల మధ్య సంబంధాలకు ఆధారం ఐదు మూల సూత్రాలని హిల్లరీ క్లింటన్ పేర్కొన్నారు. సరికొత్త వ్యూహాత్మక బంధానికి మూల సూత్రాలివే...

- వ్యూహాత్మక సహకారం.
- ఇంధనం, వాతావరణ మార్పులు.
- విద్య, అభివృద్ధి.
- వాణిజ్యం, వ్యవసాయం.
- సైన్స్ అండ్ టెక్నాలజీ.